సాక్షి ఖమ్మం

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



రియల్ ఫ్రెష్!

జిల్లాలో పలువురు రైతులు ఆకుకూరలు సాగు చేస్తూ లాభాలు గడిస్తుండగా ప్రజలకు తాజా ఆకుకూరలు లభిస్తున్నాయి. IIలో



పసిడి ధగధగ..

అక్షయతృతీయ సందర్భంగా జిల్లాలో బంగారు ఆభరణాల అమ్మకం జోరుగా సాగింది. షోరూంలు కిటకిటలాడాయి. IIలో

గరిష్టం / కనిష్టం
35° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉక్కబోత వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వరకు గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. గర్భగుడిలో పూజల అనంతరం శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. ఆతర్వాత శ్రీవారు, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి తెలంగాణ, ఏపీ నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం, పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

హైకోర్టులో జీపీగా ‘కొండపర్తి’



శ్రీనివాస్

ఖమ్మంలీగల్: ఖమ్మంకు చెందిన కొండపర్తి శ్రీనివాస్ రాష్ట్ర హైకోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు హైకోర్టు అడ్వకేట్ జనరల్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గత 24ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టుల్లో ఆయన న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈమేరకు జీపీగా నియమించడంపై ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు తాళ్లూరి దిలీప్ చౌదరి, తేజ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు జిల్లాకు రేవంత్‌రెడ్డి



ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా ఈనెల 24వ తేదీ సోమవారం ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. సాయంత్రం 4గంటలకు నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్దకు రేవంత్‌రెడ్డి చేరుకోనుండగా.. అక్కడి నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించాక ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ప్రజా చైతన్యంతోనే సమాజ మార్పు



మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా చైతన్యంతోనే సమాజంలో మార్పు త్వరగా వస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బీజేపీ విచ్ఛిన్నకర విధానాలను ప్రజలకు వివరించడమే కాక స్థానిక సమస్యలను గుర్తించేలా జిల్లాలో ఎనిమిది రోజుల పాటు సీపీఐ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా పోరుయాత్ర విజయవంతమైందని ఆయన ఆయన తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం తోట రామాంజనేయులు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ 200 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించామని చెప్పారు. ఈసందర్భంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కాగా, మరో సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ అకాల వర్షంతో తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించాలన్నారు. ఈ సమావేశాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి యర్రా బాబు, లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మిడికంటి వెంకట్‌రెడ్డి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, సీహెచ్.సీతామహాలక్ష్మి, మిడికంటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవోపేతంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు.

ఈద్ ముబారక్..

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శనివారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపవాస దీక్షలు విరమించిన తర్వాత పేదలకు ఫిత్రా దానం చేశారు. ఖమ్మం గొల్లగూడెంలోని ఈద్గాలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, వైరాలో ఎమ్మెల్యే రాములునాయక్, సహా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొనడమే కాక ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



నమాజ్ చేస్తున్న చిన్నారులు

ఖమ్మం గొల్లగూడెం ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు, చిత్రంలో మంత్రి పువ్వాడ అజయ్

మళ్లీ దెబ్బతీసిన వాన

ఈదురుగాలులు, అకాల వర్షానికి పంట నష్టం

- 2,387.20ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా
- వరి, మామిడి, మొక్కజొన్నపై ప్రభావం
- యాసంగిలో రైతులను వీడని ప్రకృతి వైపరీత్యాలు



నేలకొండపల్లి : తడిసిన ధాన్యాన్ని పైనంపల్లి రహదారి వెంట ఆరబెడుతున్న రైతు కుటుంబం

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలు అన్నదాతను వెంటాడుతూనే ఉన్నాయి. పంటలు చేతికందే సమయాన ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరుగుతోంది. సమృద్ధిగా నీరు ఉండి పంటల సాగు ఆశాజనకంగా ఉన్న పరిస్థితుల్లో ప్రకృతి కరుణించటం లేదు. గత నెలలో కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతినగా, శుక్రవారం రాత్రి ఈదురుగాలులు, అకాల వర్షాలకు మరోసారి నష్టం వాటిల్లింది. జిల్లాలో 2,387.20 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రధానంగా వరి, మొక్కజొన్నతో పాటు మామిడి పంటలను రైతులు నష్టపోయారు. దీనికి తోడు ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడ్డారు.

వరి, మొక్కజొన్న, మామిడికి నష్టం

శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన అకాల వర్షానికి వ్యవసాయ శాఖ పరిధిలో 1,616 మంది రైతులకు చెందిన 2,091.20 ఎకరాల వరి, మొక్కజొన్న దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం అర్బన్ మండలాల్లో ఈ నష్టం కనిపించింది. ఇక నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, వైరా మండలాల్లో 296 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం ఏర్పడింది.



తిరుమలాయపాలెం : బీరోలులో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి నగేష్

వెంటాడుతున్న అకాల వర్షాలు

యాసంగి పంటలను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. గతనెల మూడు, నాలుగు వారాల్లో ప్రకృతి వైపరీత్యానికి జిల్లాలో 18,258 మంది రైతులకు చెందిన 23,632 ఎకరాల్లో మొక్కజొన్న, పెసర పంటలకు నష్టం వాటిల్లింది. ఈమేరకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున రూ. 23,63,24,250 పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ పరిహారం చేతికి రాకముందే మరోసారి అకాల వర్షం పంటలను దెబ్బతీసింది. ఈమేరకు పంట నష్టం వివరాలను వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రాథమిక అంచనాలతో ప్రభుత్వానికి నివేదించాయి.

మండలాలు, పంటల వారీగా నష్టం (విస్తీర్ణం ఎకరాల్లో)

మండలం	వరి		మొక్కజొన్న		మొత్తం	
	రైతులు	విస్తీర్ణం	రైతులు	విస్తీర్ణం	రైతులు	విస్తీర్ణం
ఖమ్మం రూరల్	371	670	87	200	458	870
తిరుమలాయపాలెం	--	--	318	469	318	469
కూసుమంచి	--	--	25	54	25	54
నేలకొండపల్లి	369	398.20	47	58	416	456.20
ఖమ్మం అర్బన్	280	215	19	27	299	242
మొత్తం	1,020	1,283.20	496	808	1,516	2,091.20

‘గూడెం’లో యాత్రా స్పెషల్

కొత్తగూడెంఅర్బన్: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) పేరుతో రైల్వే అధికారులు టెంపుల్ సిటీలను అనుసంధానం చేస్తూ పలు రైళ్లను నడుపుతున్నారు. పూర్తిగా ఏసీ కోచ్‌లు ఉండే ఈ రైలులో ప్రయాణించే భక్తులకు భోజనం, స్టేషన్‌లో ఆగిన తర్వాత సమీపంలోని ఆలయానికి వెళ్లేందుకు ప్రత్యేక బస్సు లేదా వాహన సౌకర్యం కూడా రైల్వే అధికారులే కల్పిస్తారు. అందులో భాగంగా న్యూఢిల్లీ నుంచి ఏడు రోజుల యాత్ర కోసం నాగపూర్, అయోధ్య, కాశి, భద్రాచలం ఆలయాలకు వెళ్లే రైలు శనివారం రాత్రి భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అందులో వచ్చిన 60 మంది భక్తులు భద్రాచలానికి ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు. వారు శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని తిరిగి రాగానే రైలు బయలుదేరనుంది. కాగా, యాత్రా స్పెషల్ రైలును స్థానికులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకించి, వివరాలు తెలుసుకున్నారు.



కొత్తగూడెం స్టేషన్‌లో ఆగిన యాత్రా స్పెషల్ రైలు

తెలంగాణలో మతసామరస్యం

- ముస్లింల సంక్షేమానికి రూ.వేల కోట్ల నిధులు
- రంజాన్ ప్రార్థనల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మంత్రి పువ్వాడ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం రూ.వేల కోట్ల నిధులు వెచ్చిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఖమ్మం గొల్లగూడెంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పువ్వాడ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయోగపడే అల్లా బోధనలను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని సూచించారు. తెలంగాణలో ముస్లింల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం దాదాపు రూ.13వేల కోట్లు వెచ్చించిందని తెలిపారు. ఆయా పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. గతంలో మాత్రం మైనార్టీలను ఓటు బ్యాంకులా చూసిన పార్టీల నేతలు ఏనాడూ సంక్షేమం, అభివృద్ధి పట్టించుకోలేదని చెప్పారు. దేశంలోని తెలంగాణలో మాత్రం మత సామరస్యం పరిఢవిల్లుతోందని మంత్రి పువ్వాడ వెల్లడించారు. అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రార్థనల్లో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సుడా చైర్మన్ విజయ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ కూరాకుల వలరాజుతో పాటు పలువురు ప్రజాప్రతి నిధులు, నాయకులు పాల్గొన్నారు.

150 ధాన్యం కేంద్రాలు ప్రారంభం

అదనపు కలెక్టర్ మధుసూదన్

నేలకొండపల్లి: జిల్లాలో యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన ధాన్యంలో 4లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. మండలంలోని రాజేశ్వరపురంలో పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 230 కేంద్రాలకు గాను 150 కేంద్రాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆయా కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించడమే కాకుండా కాంటా, తరలింపు వేగంగా చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో దాదాపు 100 లారీల ధాన్యం వచ్చే అవకాశముండగా మిల్లర్ల వద్ద 30 లారీల ధాన్యానికే స్థలముందని తెలిపారు. దీంతో మిల్లుల్లో ఉన్న సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐ గోదాంలకు పంపించడంపై దృష్టి సారించామని వివరించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీపీ రమ్య, సొసైటీ సీఈఓ వీరబాబుతో పాటు దండా నర్సింహారావు, జటంగి చంద్రమ్మ, బోనగిరి కిరణ్, దండా రంగయ్య, పోలంపల్లి ఉపేందర్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రం పరిశీలన

కల్లూరు రూరల్: మండలంలోని పుల్లయ్య బంజరులో మల్లికా గ్రామ సమాఖ్య ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్డీఓ విద్యాచందన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోళ్ల తీరు, సమస్యలపై ఆరా తీశారు. అలాగే, కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జీప్రసాద్, డీపీఎం దర్గయ్యతో పాటు వెంకట్రామారావు, వెంకటేశ్వరావు, సోములు, సత్యనారాయణ, మల్లేశ్వరావు, పుల్లయ్య, నారాయణరావు, శ్రీనివాసరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

చలచల్లగా.. చీర్స్!



- ఉమ్మడి జిల్లాలో జోరుగా బీర్ల అమ్మకం
- ఎండ తీవ్రతతో పెరిగిన డిమాండ్
- 21 రోజుల్లో రూ.24.35 కోట్ల మేర విక్రయాలు

వైరా: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే చెమటలు పట్టిస్తున్నాయి. దీంతో మందుబాబుల దృష్టి బీర్లపై పడుతోంది. తద్వారా అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఎండల తీవ్రత కారణంగా అందరూ కొబ్బరి బొండాలు, చెరుకురసాలు, పండ్ల రసాలతో సేద దీరుతుంటారు. కానీ మద్యం ప్రియులు మాత్రం చల్లని బీర్లతో ఛిల్ అవుతున్నారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీర్లకు నానాటికీ డిమాండ్ పెరుగుతోంది.

రికార్డు స్థాయిలో అమ్మకాలు

ఉమ్మడి జిల్లాలో 210 వైన్స్, 50 బార్లతో పాటు మూడు క్లబ్‌లు ఉన్నాయి. ఆయా వైన్స్, బార్లకు వైరాలోని బేవరేజెస్ గోదాం నుంచి మద్యం సరఫరా అవుతుంది. ఈ నెలలో శుక్రవారం(21వ తేదీ) వరకు ఈ గోదాం నుంచి రూ.24.35కోట్ల విలువైన బీర్లు తీసుకెళ్లారంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో ఎండలు 42 డిగ్రీలు దాటుతుండడంతో సాధారణంగా మద్యం తాగే వారు కూడా బీర్లవైపే మొగ్గు చూపుతున్నారని వైన్స్ నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కారణాలు ఏమైనా గరిష్ట స్థాయిలో బీర్ల అమ్మకం జరుగుతుండడంతో అటు ఆబ్కారీ శాఖకు ఆదాయం.. ఇటు మద్యం షాపుల యజమానులకు లాభాల పంట పండుతోంది.

అదనపు వసూళ్లు

మద్యం వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా సిండికేట్‌గా మారినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా బీర్లకు డిమాండ్ పెరగడంతో ఇదే అదనుగా మద్యం బాబుల జేబులకు చిల్లు పెట్టడంపై దృష్టి సారించారు. కూలింగ్ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తుండగా.. డిమాండ్ ఉన్న బీర్లు కాకుండా తమకు అధిక లాభాలను తీసుకొచ్చే బ్రాండ్లనే అమ్ముతున్నారని తెలుస్తోంది. కొన్నిచోట్ల డిమాండ్ ఉన్న కంపెనీల బీర్లు రాత్రి 7గంటలు దాటాక లభ్యం కావడం లేదని సమాచారం. ఇక కొందరు ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.15 వరకు వసూలు చేస్తుండడం గమనార్హం.

బీర్ల అమ్మకాలు ఇలా...

నెల	గత ఏడాది (రూ.కోట్లలో)	ఈ ఏడాది (రూ.కోట్లలో)
జనవరి	14.44	19.68
ఫిబ్రవరి	18.20	25.14
మార్చి	27.60	30.77
ఏప్రిల్	34.30	24.35 (21వ తేదీ వరకు)
మే	35.93	--
జూన్	30.70	--

ఆఫర్లతో ఆకట్టుకునేలా..

కొన్ని వైన్స్‌ల యజమానులు బీర్లపై అదనంగా వసూలు చేస్తుండగా.. జిల్లా కేంద్రంలోని కొన్ని బార్ షాపుల యజమానులు ఆఫర్లు ప్రకటిస్తున్నారు. సహజంగా బార్లలో బీర్‌పై అదనంగా రూ.15 నుంచి రూ.20 వరకు తీసుకుంటారు. కానీ లైసెన్స్ ఫీజు మేర అమ్మకాలు జరగక నష్టాలు వస్తుండడంతో కొందరు ఆఫర్లు ప్రకటించేశారు. ఎమ్మార్పీతోనే బీర్లు అమ్ముతామంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మందుబాబులను ఆకట్టుకోవడంలో నిమగ్నమయ్యారు. దీంతో అటు ఏసీ గదుల్లో కూర్చుని ఇటు చల్లని బీరు తాగొచ్చని పలువురు మొగ్గు చూపుతున్నట్లు పెరిగిన అమ్మకాల ఆధారంగా తెలుస్తోంది.

క్లుప్తంగా

'వంద నవ్వుల విందు' కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రవి తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 7న 'వంద నవ్వుల విందు' పేరిట నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ మేరకు కార్యక్రమ కరపత్రాలను శనివారం ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి ఆవిష్కరించి మాట్లాడారు. ఆరోగ్యానికి మంచిదైన నవ్వు ప్రాముఖ్యతను చాటేలా సాంస్కృతిక కార్యక్రమంగా ప్రదర్శిస్తున్న కమెడియన్ మొగిలి గుణాకర్ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో నెలనెలా వెన్నెల అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్ కుమార్‌తో పాటు ఎం.ప్రసాద్, జె.రమేశ్, కోదాడ నర్సింహారావు, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టడంతో బోల్తా పడిన డీసీఎం



బోల్తా పడిన డీసీఎం వాహనం

కొణిజర్ల: ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో అదుపు తప్పిన డీసీఎం బోల్తా పడింది. స్థానికులు, డీసీఎం డ్రైవర్ కథనం ప్రకారం.. ఏపీలోని వైజాగ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం వాహనం మరమ్మతుకు రావడంతో శనివారం తెల్లవారుజామున కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం సమీపాన నిలిపారు. ఈ క్రమంలో ఖమ్మం వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టడంతో డీసీఎం.. పక్కన ఉన్న గోతిలో బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడకున్నా డీసీఎం క్యాబిన్ నుజ్జునుజ్జయింది.

నాగులవంచలో చోరీకి యత్నం

చింతకాని: మండలంలోని నాగులవంచలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఊట్ల వెంకటరెడ్డి ఇంట్లో శనివారం పట్టపగలే ఓ దుండగుడు చోరీకి యత్నించాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటరెడ్డి బయటకు వెళ్లగా, ఆయన భార్య స్నానానికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేనిది గుర్తించిన దుండగుడు చొరబడ్డాడు. ఇంతలోనే బాత్‌రూం నుంచి బయటకు వెంకటరెడ్డి భార్య కేకలు వేయడంతో స్థానికులు వస్తుండగా దుండగుడు పరారయ్యాడు. ఈమేరకు బ్లూకోట్ కానిస్టేబుల్ అప్పికట్ల వెంకటేశ్వర్లు చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఈనెల 13న గ్రామానికి ఆలస్యం భారతమ్మ మెడలో గొలుసు చోరీకి యత్నించగా, 18వ తేదీనన పరిటాల వీరాంజనేయులు ఇంట్లో చోరీ జరిగింది. గ్రామంలో వరుస చోరీలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నీటి సంప్‌లో పడి వ్యక్తి మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ప్రమాదవశాత్తు నీటి సంప్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ బాణాల రాము వివరాల ప్రకారం.. మండలంలోని బేతుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సారకాయాల వెంకటేశ్వరరావు (26) శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలోని నీటి సంప్‌లో పడిపోయాడు. కాసేపయ్యాక తండ్రి ఆదయ్య గమనించడంతో వెంకటేశ్వరరావును సంప్ నుంచి బయటకు తీసేలోగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఏడాది కిందటే వివాహం కాగా, ఆయన భార్య కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

రంజాన్ వేళ గోకినేపల్లిలో విషాదం

నేలకొండపల్లి: జిల్లావ్యాప్తంగా ముస్లింలు శనివారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కానీ, ఆ కుటుంబం మూడు రోజులుగా నిద్రాహారాలు మాని తమ కుమారుడి ఆచూకీ కోసం ఎదురుచూస్తుండగా పండుగ రోజే మృతదేహం లభించడంతో వారి ఆవేదనకు అంతు లేకుండా పోయింది. ముదిగొండ మండలం గోకినేపల్లికి చెందిన షేక్ లాలు (13) స్నేహితులతో కలిసి గురువారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంలోని ఓ గ్రానైట్ క్వారీ నీటి గుంతలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు లాలు గల్లంతుకాగా.. ఆనాటి నుంచి గ్రామస్తులు, అధికారులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు 20 ట్రాక్టర్ల ద్వారా గుంతలోని నీరు బయటకు తీసేందుకు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున లాలు మృతదేహం బయటపడింది. లాలు తండ్రి జాన్ మియా సైకిల్ షాపు నడుపుతుండగా ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంచి స్థాయికి చేరి కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కుమారుడు మృతి చెందడం.. రంజాన్ పండుగ నాడే మృతదేహం బయటపడడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

రియల్ ఫ్రెష్ !



మంగాపురంలో సాగు చేసిన పుదీనా తోట, (ఇన్‌సెట్) బచ్చలికూర

వేసవిలో ఆకుకూరల సాగుపై రైతుల దృష్టి

- ఎకరం, అర ఎకరం భూముల్లో సాగు
- తక్కువ పెట్టుబడితో రోజువారీ ఆదాయం
- స్థానికంగానే కాక కొత్తగూడెం, ఖమ్మం, వైరా మార్కెట్లలో అమ్మకం

తల్లాడ: సీజనల్‌గా మార్కెట్‌కు వచ్చే ఆకుకూరలపై అందరికీ ఆసక్తే. కానీ ఉమ్మడి జిల్లా రైతాంగం ఆకుకూరలపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. ఫలితంగా అక్కడ నుంచి తీసుకొచ్చే అమ్మేలోగా వాడిపోవడం సాధారణమైంది. కానీ ఇప్పుడు జిల్లాలో పలువురు రైతులు ఆకుకూరల సాగుపై మక్కువ కనబరుస్తుండడంతో ప్రజలకు నాణ్యమైన ఆకుకూరలు అందుబాటులోకి రావడమే కాక రైతులకు రోజువారీ ఆదాయం లభిస్తోంది. తక్కువ పెట్టుబడితో స్వల్పకాల వ్యవధిలోనే వారు లాభాలు గడిస్తున్నారు.

● తల్లాడ మండలంలో 300 ఎకరాలకు పైగానే...

ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని పలువురు రైతులు ఆకుకూరలు సాగు చేస్తున్నారు. మండలంలోని మంగాపురం, గొల్లగూడెం, కిష్టాపురం, నారాయణపురం, తల్లాడ, అన్నారుగూడెం, నరసింహారావుపేట, బిల్లుపాడు, వెంగన్నపేట, రేజర్ల, తెలగవరం, ముద్దునూరు, పినపాక, కుర్నవల్లి తదితర గ్రామాల్లో 300 ఎకరాలకు పైగా సాగవుతున్నాయి. ఆయా రైతులు తోట కూర, బచ్చలి కూర, పాల కూర, గోంగూర, పుదీనా సాగు చేస్తుండగా... స్థానికంగా తోటల వద్దే అమ్మడంతో పాటు వైరా, ఖమ్మం, కొత్తగూడెం మార్కెట్లకు తరలించి ఆదాయం పొందుతున్నారు. ఈ ఏడాది వేసవికాలం ఆరంభం నుంచే ఆకు కూరలు సాగు మొదలుపెట్టగా ఇప్పుడు చేతికొస్తున్నాయి.

● లాభాల పంటలే..

పలు గ్రామాల్లో సాగు చేసిన పాల కూర, తోటకూర, బచ్చలి, గోంగూరతో రైతులు లాభాలు గడిస్తున్నారు. వాణిజ్య పంటల సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడి అవుతున్నా లాభనష్టాలు ఎలా ఉంటాయో తెలియడం లేదు. ఈ నేపథ్యాన రైతులు ఎకరం, అర ఎకరం లోపు భూముల్లో ఆకు కూరలు సాగు చేస్తూ నికర ఆదాయం పొందుతున్నారు. తక్కువ పెట్టుబడితోనే రోజువారీగా ఆదాయాన్ని సమకూరుతుండడంతో ఒకరిని చూసి ఇంకొకరు వందల సంఖ్యలో రైతులు సాగుపై మక్కువ కనబరుస్తున్నారు.

● నూతనంగా పుదీనా పంట..

మండలంలోని మంగాపురంలో ఈ ఏడాది తొలిసారిగా గాదె నరసింహారావు, గాదె కృష్ణమూర్తి తదితరులు పుదీనా సాగు ఆరంభించారు. జనవరిలో విత్తనాలు తెప్పించి చల్లగా ఇప్పుడు మొదటి కోత వచ్చింది. వివిధ శుభకార్యాల్లో వంటల్లోనే కాక ఇళ్లలోనూ పుదీనా వాడకం ఎక్కువ. కానీ ఇక్కడ సాగు లేకపోవడంతో విజయవాడ తదితర ప్రాంతాల నుంచి తెప్పించాల్సి వచ్చేది. ఇప్పుడు జిల్లాలోనే అందుబాటులోకి రావడంతో పలువురు వ్యాపారులు, క్యాటరింగ్ నిర్వాహకులు నేరుగా తోటల వద్దకు కొనుగోలు చేస్తున్నారు. పుదీనా కోత కొచ్చిన దగ్గర నుంచి నెల పాటు ప్రతిరోజు ఆదాయం సమకూరుతుందని రైతులు చెబుతున్నారు.



పుదీనా తోటలో కలుపు తీస్తున్న కూలీలు

పుదీనా ఆకు కోతకొచ్చింది



పుదీనా ఆకు రెండున్నర ఎకరాల్లో సాగు చేశాం. ప్రస్తుతం కోతకు కొచ్చింది. ఆకులో కలుపు మొక్కలు లేకుండా తొలగించి కట్టలు కట్టి మార్కెట్‌కు తరలిస్తున్నాం. తల్లాడలో అమ్మడమే కాక వైరా, ఖమ్మం, కొత్తగూడెం మార్కెట్లలోని వ్యాపారులకుపుదీనా సరఫరా చేస్తున్నాం.

– గాదె కృష్ణమూర్తి, మంగాపురం

మార్కెట్ సౌకర్యం బాగానే ఉంది..



మంగాపురంలో కొన్నేళ్లుగా ఆకు కూరలు పండిస్తుంటాం. జనవరి నెలలో సాగు చేసిన ఆకు కూరలు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కోతకొస్తాయి. వేసవి కాలం కావడంతో మార్కెట్‌లో ఆకు కూరలకు మంచి డిమాండ్ ఉంటుంది. తక్కువ పెట్టుబడితోనే నికరం ఆదాయం సమకూరుతోంది.

– పరుచూరి నాగేశ్వరరావు, మంగాపురం

పసిడి ధగధగ..

- 'అక్షయ తృతీయ' సందర్భంగా కళకళలాడిన షోరూంలు
- జోరుగా బంగారు ఆభరణాల కొనుగోళ్లు



ఖమ్మంలోని ఓ జ్యూయెలరీ షోరూంలో వినియోగదారులు

ఖమ్మంగాంధీచౌక్: అక్షయ తృతీయ సందర్భంగా శనివారం బంగారం కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఈ రోజు బంగారం కొనుగోలు చేస్తే మంచిదనే నమ్మకంతో ప్రజలు ఆసక్తి కనబరిచారు. దీనికి తోడు జ్యూయెలరీ షాపులు, షోరూంలలో ఆఫర్లు ప్రకటించడంతో అవసరానికి ముందుగానే కొనుగోలు చేశారు. జిల్లాలో రూ.కోట్ల విలువైన బంగారు ఆభరణాల కొనుగోళ్లు జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్, కమాన్‌బజార్, కస్బాబజార్ వైరారోడ్లలో ఉన్న షోరూంలన్నీ వినియోగదారులతో కళకళలాడాయి. సాధారణంగా జిల్లాలో రోజుకు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల మేర వ్యాపారం సాగుతుంది. కానీ, అక్షయ తృతీయ సందర్భంగా శనివారం మాత్రం రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పైగానే అమ్మకాలు జరిగి ఉంటాయని అంచనా.

ఆకట్టుకునేలా డిజైన్లు

మహిళలతో పాటువర్గాల ప్రజలను ఆకట్టుకునేలా షోరూం యజమానులు సరికొత్త డిజైన్లతో ఆభరణాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతేకాకుండా పలువురు ఆఫర్లు ప్రకటించారు. దీంతో ట్రెండ్‌కు తగినట్లుగా ఆభరణాలను పలువురు ఆసక్తిగా కొనుగోలు చేశారు. అలాగే, మరికొందరు రానున్న శుభకార్యాల నిమిత్తం ఈ రోజు ఆభరణాలను కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. అక్షయ తృతీయ సందర్భంగా శనివారం ఉదయం 8 గంటల నుంచే బంగారం దుకాణాలు మహిళలతో కళకళలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోళ్లు నిరంతరాయంగా సాగాయి. పసిడి ధర పెరిగినా కొనుగోళ్లపై ఆసక్తి తగ్గలేదు. కాకపోతే ఎక్కువ మొత్తం కొనుగోలు చేయాలని భావించిన వారు ధర కారణంగా తక్కువకే పరిమితయ్యారు.



ఆభరణాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఏటా కొనుగోలు చేస్తాం..



ప్రతీ అక్షయ తృతీయకు ఎంతో కొంత బంగారం కొనుగోలు చేస్తాం. మా పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం ఉంది. అయితే, బంగారం ధర పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. ఈసారి కూడా ధర బాగానే పెరిగింది. అందుకే కొంతమొత్తమే కొనుగోలు చేశాం.

–తూములూరి శివకుమారి, దాబాలబజార్, ఖమ్మం

అమ్మకాలు పుంజుకున్నాయి..



అక్షయ తృతీయ సందర్భంగా బంగారు ఆభరణాల విక్రయాలు పుంజుకున్నాయి. పలువురు సెంటిమెంట్‌తో కొనుగోలు చేస్తారు. ఇంకొందరు ముందుగానే ఆర్డర్ ఇచ్చి ఇదే రోజున తీసుకుంటారు. ధర పెరగడంతో మరికొందరు చిన్న ఆభరణాలనే తీసుకున్నారు.

–అర్వపల్లి అశోక్‌కుమార్, మహేశ్వర జ్యూయెలరీ, ఖమ్మం

రెండు చోరీ కేసులు నమోదు

సత్తుపల్లి టౌన్: పట్టణంలోని రెండు ఇళ్లలో జరిగిన చోరీలకు సంబంధించి సత్తుపల్లి పోలీస్‌స్టేషన్లో శనివారం కేసులు నమోదయ్యాయి. పట్టణంలోని వెంగళరావు నగర్ కాలనీకి చెందిన మెకానిక్ భాస్కర్ ఇంట్లో ఈనెల 9వ తేదీన ఎవరూ లేని సమయాన గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువాలో ఉన్న రూ.84 వేల విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. ఈ విషయమై బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అలాగే, సత్తుపల్లి మండలం తుమ్మూరులోని ఉండవల్లి వెంకటేశ్వరరావు ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. ఇంట్లోని బీరువాను పగలగొట్టి సుమారు రూ.85వేల విలువైన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితులు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

'సుహాస్'లో నేడు కూడా ఆఫర్లు



సుహాస్ జ్యూయెలర్స్‌లో వినియోగదారులు

ఖమ్మంగాంధీచౌక్: జ్యూయెలరీ రంగంలో 34 ఏళ్లుగా వినియోగదారులకు సేవలందిస్తున్న ఖమ్మం వైరారోడ్డు హవేలీ రెస్టారెంట్ పక్కన సుహాస్ జ్యూయెలర్స్‌లో ఆదివారం అక్షయ తృతీయ ఆఫర్లు ఉంటాయని యజమానులు దుగ్గి సుహాస్, సంతోషి శనివారం తెలిపారు. ఆభరణాలపై మేకింగ్ చార్జీలు లేకుండా, తరుగుపై 25 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు వెల్లడించారు. వెడ్డింగ్, లైట్ వెయిట్ జ్యూయెలరీ తమ ప్రత్యేకత అని తెలిపారు. ఇక ఇన్‌స్టాగామ్ పేజీలో SLSJ_khammam ద్వారా ఆల్ ఇండియా మొత్తం డోర్ డెలివరీ చేస్తున్నట్లు వారు వివరించారు. కాగా, ఇన్నాళ్లు స్వర్ణశ్రీగా నిర్వహించిన తమ షోరూంను సుహాస్ జ్యూయెలర్స్‌గా మార్చామని, వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు

రఘునాథపాలెం: మద్యం సేవించే విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడి దాడి చేసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలోని కేసీఆర్‌కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ రవి కథనం ప్రకారం.. కాలనీలో జరిగిన కార్యక్రమంలో మద్యం సేవించే విషయంలో బానోత్ భిక్షం, రమేశ్ ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో కుంచపు నాగరాజు అడ్డుకునే ప్రయత్నం చేయగా భిక్షం ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో వీరిద్దరితో పాటు రెండు కుటుంబాలు ఘర్షణ పడాయి. తర్వాత భిక్షం, నాగరాజు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో నాగరాజు, ఆయన భార్య రజిని, బానోతు భిక్షం, ఆయన భార్య సుజాతతో పాటు కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడప గడపకూ కమలం..



వాల్‌రైటింగ్ పరిశీలిస్తున్న నాయకులు

సత్తుపల్లి: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సత్తుపల్లిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై వాల్ రైటింగ్ చేయిస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడారు. గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నట్లు తెలిపారు. మూడోసారి కూడా కేంద్రంలో మోదీ నేతృత్వాన ప్రభుత్వం ఏర్పాటవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్ల వీరంరాజు, ఉడతనేని అప్పారావు, సుదర్శన్ మిశ్రా, పడిగల మధు, ఆచంట నాగస్వామి, శ్రీను, ఇరపా కృష్ణారావు పాల్గొన్నారు.

కారును, లారీని ఢీకొట్టిన మరో లారీ

ముగ్గురికి తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్: కారును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ.. ఎదురుగా వస్తున్న మరో లారీని సైతం ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పొన్నేకల్ వద్ద శనివారం ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న కారును వెనుకాల వచ్చిన లారీ ఢీకొట్టింది. అదేవేగంతో ముందుకు దూసుకెళ్లి ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో లారీని కూడా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న బాణాపురానికి చెందిన మడికంటి ఉపేందర్, వట్టికోట సతీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే, ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సంగప్ప క్యాబిన్‌లో ఇరుక్కుపోగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు డ్రైవర్‌ను అతి కష్టమ్మీద బయటకు లాగారు. క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించి కారు డ్రైవర్ మారం విజయ్‌భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.



క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను లాగుతున్న స్థానికులు

కనుమరుగవుతున్న మానవత్వం

దంపతులను బలిగొన్న కుటుంబ కలహాలు



చిన్న నరసింహయ్య - గౌరమ్మ (ఫైల్)

మధిర: కనిపెంచి ఓ స్థాయికి చేర్చిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుంది. కానీ, కొందరు పిడికెడు అన్నం పెట్టక.. బాగోగులపై నిర్లక్ష్యం వహిస్తుండడంతో వృద్ధులు మనస్సు చంపుకోలేక తమను తాము బలితీసుకుంటున్నారు. మండలంలోని మడుపల్లి గ్రామానికి చెందిన పుచ్చకాయల చిన్న నరసింహయ్య – గౌరమ్మ దంపతులకు వెంకటనారాయణ ఒక్కడే కుమారుడు. తల్లిదండ్రులు కష్టపడి సుమారు 40 ఎకరాల భూమితో పాటు ఆస్తిపాస్తులను సంపాదించారు. పైగా చిన్న నరసింహయ్య స్వాతంత్ర్య సమరయోధుడు కావడంతో నెలనెలా రూ.35 వేల వరకు పెన్షన్ వస్తుంది. ఇంట్లో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవు. మరోపక్క కుమారుడు అంటే తల్లిదండ్రులకు, వారంటే కుమారుడికి కూడా ఎంతో ప్రేమ ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. కానీ, ఏం జరిగిందో తెలియకున్నా.. కుటుంబంలో జరిగిన వాగ్వాదంతో నరసింహయ్య, గౌరమ్మ మనస్తాపంతో శుక్రవారం ఉదయం పురుగులమందు తాగారు. ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూసిన విషయం విదితమే. వృద్ధాప్యంలో వారికి అండగా ఉంటూ బాగోగులను చూసుకోవాల్సిన కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగడమే ఈ ఘటనకు కారణమైందని సమాచారం.

వెంటాడుతున్న అకాల వర్షం


సాక్షి నెట్‌వర్క్: యాసంగిలో పంటలు సాగు చేసిన రైతాంగాన్ని అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. గత నెలలో వర్షం కారణంగా పంటలు నష్టపోగా.. మళ్లీ శుక్రవారం రాత్రి జిల్లాలోని ప్రాంతాల్లో గాలిదుమారంతో కూడిన వర్షం రైతులను ఆందోళనకు గురిచేసింది. జిల్లాలోని 1,616 మంది రైతులకు చెందిన 2,091.20 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడికి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పలుచోట్ల వరి కోతలు పూర్తికాగా.. మరికొన్ని చోట్ల కొనసాగుతున్నాయి. ఇప్పటికే కోసిన వరిని రహదారుల వెంట ఆరబోసుకున్నారు. ఇంతలోనే వర్షం రావడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీయాల్సి వచ్చింది. మరోపక్క కోతకు సిద్ధమైన తోటల్లో మామిడి కాయలు నేలరాలడంతో ధర తగ్గుతుందనే ఆవేదన వ్యక్తమవుతోంది. కాగా, ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులో దెబ్బతిన్న పంటలను పాలేరు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. అలాగే, తిరుమలాయపాలెం మండలంలో ఉద్యాన శాఖ అధికారి నగేశ్, ఏఓ సీతారాంరెడ్డి పర్యటించారు. తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి.




ఖమ్మంరూరల్: గుర్రాలపాడులో నేలవాలిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి



నేలకొండపల్లి : తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు మైసయ్య



ముదిగొండ : రహదారిపై ఆరబోయడంతో తడిసిన మొక్కజొన్నలు





సెమీస్‌లో ఓడిన సాకేత్‌-యూకీ జోడీ

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాకేత్‌-యూకీ జంటకు ఓటమి ఎదురైంది. 84 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్-యూకీ 6-7 (4/7), 3-6తో అలెగ్జాండర్ ఎర్లెర్-లుకాస్ మీడ్లెర్ (ఆస్ట్రియా) చేతిలో ఓడిపోయారు. మ్యాచ్ మొత్తంలో ఐదు ఏస్‌లు సంధించిన సాకేత్, యూకీ ఐదు డబుల్ ఫాల్ట్‌లు కూడా చేయడం గమనార్హం. భారత జోడీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి తమ సర్వీస్‌ను రెండు సార్లు కోల్పోయింది. సెమీస్‌లో ఓడిన సాకేత్-యూకీలకు 9,330 యూరోల (రూ. 8 లక్షల 47 వేలు)ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సురేఖ ‘డబుల్’ ధమాకా



ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీలో రెండు స్వర్ణ పతకాలు నెగ్గిన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి

స్వర్ణాలు సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నేనీ స్థాయికి చేరుకోవడానికి ఎంతో మంది కృషి ఉంది. వారందరికీ ధన్యవాదాలు. ఈ సీజన్‌లో మరో మూడు ప్రపంచకప్‌లు, ప్రపంచకప్ ఫైనల్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలు ఉన్నాయి. ఈ మెగా ఈవెంట్స్‌లోనూ పతకాలు సాధించడమే నా లక్ష్యం. - సురేఖ

2 ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత విభాగంలో సురేఖ సాధించిన పతకాలు. 2022లో సురేఖ రజతం నెగ్గగా, ఈసారి స్వర్ణం సాధించింది.

11 ప్రపంచకప్ టోర్నీలలో ఓవరాల్‌గా సురేఖ నెగ్గిన పతకాలు. ఇందులో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, నాలుగు కాంస్యాలు ఉన్నాయి.

2 ప్రపంచకప్ టోర్నీల్లో మిక్స్‌డ్ టీమ్‌లో సురేఖ నెగ్గిన స్వర్ణాలు. 2022లో అభిషేక్ వర్మతో కలిసి తొలిసారి స్వర్ణం గెలిచింది.



అంటాల్యా (తుర్కియే): ఆద్యంతం నిలకడగా రాణించిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ తన కెరీర్‌లో గొప్ప ప్రదర్శన చేసింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టోర్నీ వ్యక్తిగత స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఈవెంట్స్‌లో విజయవాడకు చెందిన 26 ఏళ్ల జ్యోతి సురేఖ గురి తప్పని లక్ష్యంతో మెరిపించి ఏకంగా రెండు స్వర్ణ పతకాలను దక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించింది. ముందుగా కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో తొలిసారి ప్రపంచకప్ టోర్నీలో ఆడుతున్న ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె (మహారాష్ట్ర)తో కలిసి పసిడి పతకాన్ని సాధించింది. చెన్ యి సువాన్-చెన్ చి లున్ (చైనీస్ తైపీ) జోడీతో జరిగిన ఫైనల్లో జ్యోతి సురేఖ-ఓజస్ ప్రవీణ్ 159–154 పాయింట్ల తేడాతో గెలిచింది. తొలి మూడు రౌండ్‌లలో 40కి 40 పాయింట్లు స్కోరు చేసిన భారత జోడీ చివరి రౌండ్‌లో 39 పాయింట్లు సాధించింది. ఒక పాయింట్ తేడాతో ప్రపంచ రికార్డును సమం చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 2018లో అంటాల్యాలోనే జరిగిన ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా జట్టు 160కి 160 పాయింట్లు స్కోరు చేసింది.

వరల్డ్ నంబర్‌వన్‌ను ఓడించి...

మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో తొలిసారి పసిడి పతకాన్ని ముద్దాడింది. శనివారం జరిగిన ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ సురేఖ 149–146తో (30–30, 30–29, 29–29, 30–29, 30–29) ప్రపంచ మూడో ర్యాంకర్ సారా లోపెజ్ (కొలంబియా)పై గెలిచి 20వ ప్రయత్నంలో చాంపియన్‌గా అవతరించింది. 2011 నుంచి అంతర్జాతీయ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేఖ సెమీఫైనల్లో 148–146తో (29–29, 30–30, 30–30, 29–29, 30–28) ప్రపంచ నంబర్‌వన్ ఇలా గిబ్సన్ (బ్రిటన్)పై సంచలన విజయం సాధించింది.

లక్నో చేజేతులా...

గెలిచే దారిలో ఓటమిని పిలవడం అంటే ఇదే! 19 ఓవర్లలో లక్నో స్కోరు 124/3. ఇంకా 7 వికెట్లున్న జట్టు 6 బంతుల్లో 12 పరుగులు చేస్తే చాలు. పైగా తొలి ఓవర్ నుంచి ఆడుతున్న ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీ చేసి క్రీజులో ఉన్నాడు. ఆఖరి ఓవర్ మొదటి బంతికి 2 పరుగులు కూడా చేశాడు. 5 బంతుల్లో 10 పరుగులు సులభంగానే కనిపించింది. కానీ మోహిత్ శర్మ వేసిన తర్వాతి 2 బంతులు రాహుల్, స్టొయినిస్‌లను బోల్తా కొట్టించాయి. ఇంకో 2 బంతులకు ఆయుశ్ బదోని, దీపక్ హుడా రనౌటయ్యారు. అంతే ఆఖరి బంతి మిగిలుంది కానీ... టైటాన్స్ గెలిచింది! సమీకరణం 1 బంతికి 8 పరుగులు కాగా... మోహిత్ కనీసం ఒక పరుగైనా ఇవ్వలేదు. దీంతో ఎవరూహించని విజయం గుజరాత్ గూటికి చేరింది.

- నెగ్గాల్సిన మ్యాచ్‌లో 7 పరుగులతో ఓటమి
- ఆఖరి ఓవర్లో గుజరాత్‌ను గెలిపించిన మోహిత్
- రాహుల్ శ్రమ వృథా
- రాణించిన పాండ్యా, సాహా



ఆయుశ్ బదోనిని రనౌట్ చేస్తున్న మోహిత్ శర్మ

లక్నో: మోహిత్ శర్మ స్వింగ్ (2/17)తో గుజరాత్ టైటాన్స్ కింగ్ అయ్యింది. అనూహ్యంగా ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేరింది. అలవోకగా గెలవాల్సిన చోట లక్నో సూపర్ జెయింట్స్ వరుస నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు చేజార్చుకొని ఓటమిని పలకరించింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (50 బంతుల్లో 66; 2 ఫోర్లు, 4 సిక్సర్లు), వృద్ధిమాన్ సాహా (37 బంతుల్లో 47; 6 ఫోర్లు) రాణించారు. లక్నో బౌలర్లలో కృనాల్ పాండ్యా, స్టొయినిస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 128 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ (61 బంతుల్లో 68; 8 ఫోర్లు) పోరాటం జట్టును గెలిపించలేకపోయింది. మోహిత్ శర్మకు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ లభించింది.

కెప్టెన్ ఇన్నింగ్స్...

సాహాతో శుబ్‌మన్ గిల్ (0) ‘ఇంపాక్ట్’ డకౌటైంది. వన్‌డౌన్‌లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా అండతో సాహా బౌండరీలతో టైటాన్స్ స్కోరును కదిలించాడు. ఈ జోడీ పవర్‌ప్లేలో 40 పరుగులు చేసింది. ఆ తర్వాత అడపాదడపా ఫోర్లతో 10 ఓవర్ల దాకా వికెట్‌ను కాపాడుకున్నారు. జట్టు స్కోరు 72 వద్ద సాహాను కృనాల్ పాండ్యా అవుట్ చేయగా... తర్వాత వచ్చిన అభినవ్ (3), విజయ్ శంకర్ (10) నిరాశపరచడంతో పెద్ద స్కోరేం కాలేదు. ఆఖరి ఓవర్లలో హార్దిక్ భారీ సిక్సర్లతో స్కోరు పెంచే ప్రయత్నం చేశాడు. 44 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్న పాండ్యా ఆఖరి ఓవర్లో నిష్క్రమించాడు.



కేఎల్ రాహుల్

రాహుల్ ఒంటరి పోరాటం...

లక్నో ముందున్న లక్ష్యం 136 పరుగులు. కష్టమైందో... కఠినమైందో కానే కాదు! ఓపెనింగ్ జోడీ కెప్టెన్ రాహుల్, కైల్ మేయర్స్ (19 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) పవర్ ప్లేలోనే 53 పరుగులు చేయడంతో లక్ష్యఛేదన సులువుగా సాగింది. మేయర్స్ తర్వాత కృనాల్ పాండ్యా (23 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) అవుటయ్యేసరికే జట్టు 100 పరుగులను దాటింది. నికోలస్ పూరన్ (1) విఫలమైనా... రాహుల్ క్రీజును అట్టిపెట్టుకోవడంతో ఎవరికీ ఏ బెంగా లేదు. రాహుల్ 38 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. ఆఖరి ఓవర్‌కు ముందు 124/3 స్కోరుతో లక్నో పటిష్టంగా ఉంది. కానీ ఆ తర్వాతే మోహిత్ చివరి ఓవర్ అనూహ్యంగా సూపర్ జెయింట్స్‌ను ఓడించింది. కచ్చితత్వం లేని షాట్లతో రాహుల్, స్టొయినిస్ (0)వికెట్లను పారేసుకుంటే... పరుగుల వేటలో ఆయుశ్ బదోని (8), దీపక్ హుడా (2) రనౌటయ్యారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) హుడా (బి) కృనాల్ 47; గిల్ (సి) బిష్ణోయ్ (బి) కృనాల్ 0; హార్దిక్ పాండ్యా (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 66; అభినవ్ (సి) నవీనుల్ హఖ్ (బి) మిశ్రా 3; విజయ్ శంకర్ (బి) నవీనుల్ హఖ్ 10; మిల్లర్ (సి) హుడా (బి) స్టొయినిస్ 6; తెవాటియా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 135. వికెట్ల పతనం:** 1-4, 2-72, 3-77, 4-92, 5-132, 6-135. **బౌలింగ్:** నవీనుల్ హఖ్ 4-0-19-1, కృనాల్ పాండ్యా 4-0-16-2, అవేశ్ ఖాన్ 3-0-21-0, రవి బిష్ణోయ్ 4-0-49-0, స్టొయినిస్ 3-0-20-2, అమిత్ మిశ్రా 2-0-9-1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) జయంత్ (బి) మోహిత్ 68; మేయర్స్ (బి) రషీద్ ఖాన్ 24; కృనాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 23; పూరన్ (సి) హార్దిక్ (బి) నూర్ అహ్మద్ 1; బదోని (రనౌట్) 8; స్టొయినిస్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 0; దీపక్ హుడా (రనౌట్) 2; ప్రేరక్ మన్కడ్ (నాటౌట్) 0; రవి బిష్ణోయ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-55, 2-106, 3-110, 4-126, 5-126, 6-127, 7-128. **బౌలింగ్:** షమీ 3-1-18-0, జయంత్ 4-0-26-0, రషీద్ ఖాన్ 4-0-33-1, మోహిత్ శర్మ 3-0-17-2, నూర్ అహ్మద్ 4-0-18-2, హార్దిక్ పాండ్యా 1-0-7-0, రాహుల్ తెవాటియా 1-0-8-0.

మెరుపుల్లో పంజాబ్‌దే గెలుపు

- అదరగొట్టిన స్యామ్ కరన్, హర్‌ప్రీత్
- కీలక వికెట్లు తీసిన అర్‌్షదీప్
- 13 పరుగులతో ముంబైపై పంజాబ్ కింగ్స్ గెలుపు
- గ్రీన్, సూర్యకుమార్ శ్రమ వృథా



స్యామ్ కరన్



అర్‌్షదీప్

ముంబై: మెరుపుల ప్రతాపంలో పంజాబ్ కింగ్స్ పైచేయి సాధించింది. 13 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. కెప్టెన్ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ స్యామ్ కరన్ (29 బంతుల్లో 55; 5 ఫోర్లు, 4 సిక్సర్లు), హర్‌ప్రీత్ సింగ్ (28 బంతుల్లో 41; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. జితేశ్ శర్మ (7 బంతుల్లో 25; 4 సిక్సర్లు) ఆఖర్లో శివమెత్తాడు. గ్రీన్, పియూష్ చావ్లా రెండేసి వికెట్లు తీశారు. తర్వాత భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులకు పరిమితమైంది. గ్రీన్ (43 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ (26 బంతుల్లో 57; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోహిత్ శర్మ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (13 బంతుల్లో 25 నాటౌట్; 2 సిక్స్‌లు) చెలరేగారు. కానీ ఆఖరి ఓవర్ ఫినిషింగ్‌లో అర్‌్షదీప్ (4/29) నిప్పులు చెరగడంతో ముంబై విజయానికి దూరమైంది. ముంబై గెలుపునకు ఆఖరి ఓవర్లో 16 పరుగులు కావాల్సి ఉండగా... అర్‌్షదీప్ 2 పరుగులే ఇచ్చి తిలక్ వర్మ (3), నేహల్ వధేరా (0) వికెట్లను విరిచేశాడు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: షార్ట్ (సి) చావ్లా (బి) గ్రీన్ 11; ప్రభ్‌సిమ్రన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అర్జున్ 26; అథర్వ (బి) చావ్లా 29; లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) కిషన్ (బి) చావ్లా 10; హర్‌ప్రీత్ (బి) గ్రీన్ 41; కరన్ (సి అండ్ బి) ఆర్చర్ 55; జితేశ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 25; షారుక్ నాటౌట్ 0; హర్‌ప్రీత్ బ్రార్ రనౌట్ 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-18, 2-65, 3-82, 4-83, 5-175, 6-197, 7-209, 8-214. **బౌలింగ్:** అర్జున్ టెండూల్కర్ 3-0-48-1, బెహ్రెన్‌డార్ఫ్ 3-0-41-1, గ్రీన్ 4-0-41-2, ఆర్చర్ 4-0-42-1, పీయూష్ చావ్లా 3-0-15-2, హృతిక్ షోకీన్ 3-0-24-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి అండ్ బి) లివింగ్‌స్టోన్ 44; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) అర్‌్షదీప్ సింగ్ 1; గ్రీన్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 67; సూర్యకుమార్ యాదవ్ (సి) అథర్వ (బి) అర్‌్షదీప్ 57; టిమ్ డేవిడ్ (నాటౌట్) 25; తిలక్‌వర్మ (బి) అర్‌్షదీప్ సింగ్ 3; నేహల్ వధేరా (బి) అర్‌్షదీప్ సింగ్ 0; ఆర్చర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-8, 2-84, 3-159, 4-182, 5-200, 6-200. **బౌలింగ్:** షార్ట్ 1-0-7-0, అర్‌్షదీప్ 4-0-29-4, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-15-0, స్యామ్ కరన్ 3-0-41-0, ఎలిస్ 4-0-44-1, రాహుల్ చహర్ 4-0-42-0, లివింగ్‌స్టోన్ 2-0-23-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	7	4	3	8	0.547
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	6	4	2	8	0.212
పంజాబ్	7	4	3	8	-0.162
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	6	3	3	6	-0.254
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు x రాజస్తాన్ (మ. గం. 3:30 నుంచి)
కోల్‌కతా x చెన్నై (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

‘కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ’ ప్రారంభం



గచ్చిబౌలి: బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మరో శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. శనివారం గచ్చిబౌలిలో కొటక్ మహీంద్ర బ్యాంక్ లిమిటెడ్ సీఎస్‌ఆర్ అసోసియేట్, పుల్లెల గోపీచంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘కొటక్-పుల్లెల గోపీచంద్ అకాడమీ’ని ప్రారంభించారు. ఈ అకాడమీని అత్యాధునిక మౌలిక వసతులు, అంతర్జాతీయ కోచ్‌లతో ప్రపంచస్థాయి బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దుతామని... ఔత్సాహిక, అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తామని జాతీయ చీఫ్ కోచ్ గోపీచంద్ వ్యాఖ్యానించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా కొటక్ మహీంద్ర బ్యాంక్ భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రపంచస్థాయి శిక్షణ సౌకర్యాన్ని అభివృద్ధి చేసేందుకు సహకారం అందిస్తుందన్నారు. యువత భవిష్యత్ కోసం క్రీడా మౌలిక వసతులు అందించేందుకు గోపీచంద్ అకాడమీతో కలిసి పనిచేస్తామని కొటక్ మహీంద్ర బ్యాంక్ హోల్ టైమ్ డైరెక్టర్ శాంతి ఏకాంబరం పేర్కొన్నారు. కొటక్-పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రంలో అత్యుత్తమ నాణ్యత గల న్యూట్రీషియనిస్టులు, ఫిజియోథెరపిస్టులు, నిపుణులతో కూడిన స్పోర్ట్స్ సైన్స్ సెంటర్ ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన కోచ్‌లు, క్రీడాకారుల కోసం ఫెలోషిప్ ప్రోగ్రామ్, బ్యాడ్మింటన్ శిక్షణ పరిధిని విస్తరించేందుకు పూర్వ క్రీడాకారుల కోసం కోచ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహీంద్ర గ్రూప్ ప్రెసిడెంట్, సీఎఫ్‌ఓ జైమిన్ భట్, ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, భారత షట్లర్లు సైనా నెహ్వాల్, సిక్కి రెడ్డి, శ్రీకాంత్, సాయి ప్రణీత్, పుల్లెల గాయత్రి, ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ అర్జున్



అస్తానా (కజకిస్తాన్): సాటీ జుల్దిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ చాంపియన్‌గా అవతరించాడు. శనివారం ముగిసిన ఈ టోర్నీలో అర్జున్ నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. శనివారం జరిగిన చివరి మూడు రౌండ్ గేముల్లో అర్జున్ రెండింటిలో గెలిచి, మరో గేమ్‌ను ‘డ్రా’ చేసుకొని ఈ టోర్నీని అజేయంగా ముగించాడు. క్రామ్నిక్ (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ 47 ఎత్తుల్లో గెలుపొందగా... అరోనియన్ (అమెరికా)తో జరిగిన పదో రౌండ్‌ను అర్జున్ 24 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో అర్జున్ 58 ఎత్తుల్లో గెలిచాడు.

బోపన్న జోడీ ఓటమి

బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ టెన్నిస్ టోర్నీ డబుల్స్ సెమీఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 4-6, 5-7తో వెస్లీ కూలాఫ్ (నెదర్లాండ్స్)-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడింది. బోపన్న జోడీకి 45,120 డాలర్ల (రూ. 37 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.

సినిమా

ఆ ఒక్క సెంటిమెంట్ ఫాలో అవుతున్నా! - అఖిల్

"30 ఏళ్లకు పైగా మా నాన్నగారు (నాగార్జున) ఇండస్ట్రీలో ఉన్నారు కాబట్టి ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ఆయనకు మంచి గ్రిప్ ఉంది. నాకేమైనా సందేహాలు ఉంటే ఆయన్ని అడిగి తెలుసుకుంటాను. అయితే ఫలానా స్క్రిప్ట్ ఓకే చేయాలా? వద్దా అని అడగను. అలా చేస్తే నా కెరీర్ తాలూకు ఒత్తిడిని నాన్నపై పెట్టినట్లు ఉంటుంది. ఆయన ప్రమేయం ఎక్కువగా ఉంటే ఓ వ్యక్తిగా నేను ఎదగలేక పోవచ్చు. అందుకే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాను. ఈ కారణంగానే ‘ఏజెంట్’ స్క్రిప్ట్‌ను నాన్నతో షేర్ చేయలేదు" అన్నారు అఖిల్. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన చిత్రం ‘ఏజెంట్’. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అఖిల్ చెప్పిన విశేషాలు.

● నాకు యాక్షన్ సినిమాలంటే చాలా ఇష్టం. నా గత చిత్రం ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్’ టైమ్‌లో సూరిగారు (సురేందర్ రెడ్డి) ‘ఏజెంట్’ కథ చెప్పారు. నాకూ నచ్చింది. దాంతో వెంటనే అనౌన్స్ చేశాం. అయితే స్క్రిప్ట్ పూర్తి కావడానికి, నా లుక్ మార్చుకోవడం, లాక్‌డౌన్ వంటి వాటి వల్ల ఈ సినిమా ఆలస్యమైంది. ● ‘ఏజెంట్’లో నేను రామకృష్ణ (రిక్కీ) అనే పాత్ర చేశాను. రిక్కీ పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ‘ఏజెంట్’ ఒక మంచి స్పై డ్రామా. సురేందర్ రెడ్డిగారు ప్రతిదీ ఫైన్ ట్యూన్ చేస్తారు. నేను ఆయన్ను బ్లైండ్‌గా ఫాలో అయ్యాను. ఇక సెకండాఫ్‌లో వచ్చే టార్చర్ సీన్ కోసం చాలా కష్టపడ్డాను. ● సాధారణంగా నేను సెంటిమెంట్స్‌ను నమ్మను. అయితే ఏప్రిల్ 28న ‘అడవి రాముడు’, ‘పోకిరి’, ‘బాహుబలి’ వంటి ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు విడుదలయ్యాయి. ఇలాంటి హిట్ సినిమాలు విడుదలైన ఏప్రిల్ 28న ‘ఏజెంట్’ సినిమా విడుదల అవుతోంది. ఈ సెంటిమెంట్‌ను మాత్రం ఫాలో అవుతున్నాను. ● నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అనేది నా కల. అది నాన్నగారి వందో సినిమా అయితే నాకు ఇంకా సంతోషం. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది. కానీ నాకు తెలిసి అలాంటి స్క్రిప్ట్ ఏదీ ఫైనలైజ్ కాలేదు. ‘ఏజెంట్’ సినిమా ట్రైలర్ చూసి, నేను చాలా కష్టపడ్డానని తెలిసి మా అమ్మగారు (అక్కినేని అమల) ఎమోషన్ అయ్యారు.



జై శ్రీరామ్.. జై శ్రీరామ్



ప్రభాస్

‘నీ సాయం సదా మేమున్నాం.. సిద్ధం సర్వ సైన్యం.. సహచరులై పదా వస్తున్నాం. సఫలం స్వామి కార్యం’ అంటూ ‘జై శ్రీరామ్’ నామం ప్రతిధ్వనించేలా ‘ఆదిపురుష్’ చిత్రం నుంచి ఓ లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ప్రభాస్ టైటిల్ రోల్‌లో ఓం రౌత్ దర్శకత్వం వహించిన చిత్రం ‘ఆదిపురుష్’. శనివారం ఈ చిత్రం నుంచి 60 సెకన్ల ‘జై శ్రీరామ్’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. అజయ్–అతుల్ స్వరపరిచిన ఈ గీతాన్ని హిందీ, తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల చేశారు. తెలుగులో రామజోగయ్య శాస్త్రి రాశారు. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది.

ఐ హేట్ లవ్



సుధీర్‌బాబు

‘‘దేవుడడిగాడంట.. నన్ను చేరడానికి ఏడు జన్మలు నాకు భక్తుల్లా బతుకుతారా...లేక మూడు జన్మలు రాక్షసుల్లా బతుకుతారా అని. ఏడు జన్మలు నీకు దూరంగా ఉండే కన్నా... మూడు జన్మల రాక్షస బతుకే మిన్న అని దేవతలే కోరుకున్నారట’, ‘ఐ హేట్ లవ్’ అనే డైలాగ్స్‌తో విడుదలైంది ‘మామా మశ్చీంద్ర’ టీజర్. సుధీర్ బాబు హీరోగా హర్షవర్ధన్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ చిత్రంలో మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లు. సోనాలీ నారంగ్, సృష్టి సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. శనివారం ఈ సినిమా టీజర్‌ను హీరో మహేశ్‌బాబు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రంలో దుర్గ, డీజే, పరశురామ్ పాత్రలు చేశారు సుధీర్‌బాబు.

చైత్రతో ప్రేమ



ఇవానా, ఆశిష్

‘రౌడీ బాయ్స్’తో ఆకట్టుకున్న ఆశిష్ రెడ్డి హీరోగా నటిస్తున్న రెండో చిత్రం ‘సెల్ఫిష్’. కాశీ విశాల్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్, ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇవానా కథానాయిక. ఆమె పాత్ర పేరు చైత్ర. ఆందోళనగా ఉన్న చైత్రను హీరో తదేకంగా చూస్తున్న పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో జరిగే ఈ మాస్ లవ్‌స్టోరీలో ఆశిష్ ఓల్డ్ సిటీ కుర్రాడి పాత్ర చేస్తుండగా, ఇవానా ఫైనాన్షియల్ ఎనలిస్ట్ పాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి.